అమెరికా పర్యటన సక్సెస్

రూ.7616 కోట్ల పెట్టుబడుల సమీకరణ

- త్వరలో మోదీని కలుసుకుంటా
- సీఎం స్టాలిన్





చెన్నై, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విదేశీ పెట్టుబడుల సమీకరణ కోసం 19 రోజుల పాటు జరిపిన అమెరికా పర్యటన విజయవంతమైందని, ఆశించినదాని కంటే అత్యధికంగా పెట్టుబడులను సమీకరించగలిగామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. అమెరికా పర్యటనను ముగించుకుని శనివారం ఉదయం చెన్నైకి చేరుకున్న ఆయన విమానాశ్రయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రానికి విద్యా సంబంధిత నిధుల నిలిపివేత, రెండో ఫేజ్ మెట్రోరైలు ప్రాజెక్టుకు నిధుల మంజూరు తదితర విషయాలపై చర్చించేందుకు త్వరలో ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీతో భేటీ అవుతానని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన అపాయింట్‌మెంట్ అడిగానని చెప్పారు. ఆగస్టు 28 నుంచి 18 రోజులపాటు సాగిన తన అమెరికా పర్యటనలో శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో 8 కంపెనీలు, చికాగోలో 11 కంపెనీలు సహా మొత్తం 19 విదేశీ కంపెనీలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామని, ఫలితంగా రాష్ట్రానికి రూ.7616 కోట్ల పెట్టుబడులు సాధించగలిగామన్నారు. ఈ పెట్టుబడుల ద్వారా తిరుచ్చి, మదురై, కోయంబత్తూరు, కృష్ణగిరి, చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం తదితర జిల్లాల్లో సుమారు 11,500 మందికిపైగా ప్రత్యక్షంగా , పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. ఆగస్టు 29న శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సులో 100కు పైగా విదేశీ కంపెనీల ప్రతినిధులతో పారిశ్రామికపరమైన చర్చలు జరిపినట్లు తెలిపారు.

మళ్లీ ఫోర్డ్ కంపెనీ ఉత్పత్తులు...

అమెరికా పర్యటనలో ఫోర్డ్ కంపెనీ ప్రతినిధులు తనతో భేటీ అయినప్పుడు రాష్ట్రంలో మూడు దశాబ్దాలపాటు కార్లను ఉత్పత్తి చేసి, లక్షలాదిమందికి ఉపాధి అవకాశాలు కల్పించి, అనివార్య కారణాల వల్ల మూసివేసిన కంపెనీని మళ్లీ తెరవాలని విజ్ఞప్తి చేశానని, ఆ విషయాన్ని పరిశీలిస్తామని చెప్పి వారంతా వెళ్లిపోవడంతో తాను కాస్త నిరాశ చెందానని స్టాలిన్ చెప్పారు. అటుపిమ్మట ఫోర్డ్ కంపెనీని మళ్లీ ప్రారంభించే విషయమై ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తనకు వర్తమానం పంపారన్నారు. అయితే తాను చికాగో నుంచి స్వదేశానికి పయనమైనప్పుడు ఫోర్డ్ అధికారులు వీలైనంత త్వరగా కంపెనీని పునఃప్రారంభించనున్నట్లు ప్రకటించడం తనకెంతో సంతోషం కలిగించిందన్నారు. తన కలల పథకమైన 'నాన్ ముదల్వన్' పథకానికి ఆటో డెస్క్ సంస్థ సహాయ సహకారాలు అందించనుండడం హర్షణీయమన్నారు. గత ఆగస్టు 31న శాన్‌ఫ్రాన్సిస్కోలో, ఈ నెల 7న చికాగో నగరంలో ప్రవాస తమిళ సంఘాల ప్రతినిధులతో భేటీ కావడం తనకెంతో సంతృప్తిని కలిగించిందన్నారు.

ఘనస్వాగతం...

అమెరికా పర్యటన ముగించుకుని శనివారం ఉదయం చెన్నైకి చేరుకున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. మంత్రులు దురైమురుగన్, ఉదయనిధి స్టాలిన్, కేఎన్ నెహ్రూ, దామో అన్బరసన్, తంగం తెన్నరసు, పొన్ముడి, ఎంపీలు ఎ.రాజా, దయానిధి మారన్, జగద్రక్షగన్ తదితరులు పుష్పగుచ్ఛాలందజేసి సాదరంగా స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి రహదారికి ఇరువైపులా పార్టీ కార్యకర్తలు జెండాలు పట్టుకుని ఆయన స్వాగతం చెప్పారు.స్టాలిన్ వారికి అభివాదం చేస్తూ, నమస్కరిస్తూ తన నివాసానికి చేరుకున్నారు.

మంత్రివర్గంలో మార్పులు..

రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు జరిగే అవకాశం ఉందని స్టాలిన్ సూచన ప్రాయంగా ప్రకటించారు. పార్టీలో, ప్రభుత్వంలో మార్పులుంటాయా అని మీడియా అడగ్గా.. డీఎంకే 75వ వార్షికోత్సవాలు జరుపుకునేందుకు సిద్ధమవుతున్న తమ పార్టీ చెప్పిందే చేస్తుందని, మీరంతా ఎదురుచూస్తున్న విషయం కూడా తప్పక జరుగుతుందని నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. డీపీఐ మద్యనిషేధ మహానాడు వెనుక రాజకీయ దురుద్దేశం లేదనే తాను భావిస్తున్నానని స్టాలిన్ చెప్పారు.

శ్వేతపత్రం జారీ చేస్తే ఈపీఎస్‌కు అవమానం...

విదేశీ పర్యటనల ద్వారా అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో కంటే తక్కువగానే పెట్టుబడులు సేకరించినట్లు ప్రధాన ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి చేస్తున్న విమర్శ విడ్డూరంగా ఉందని స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విదేశీ పెట్టుబడుల సమీకరణపై శ్వేతపత్రం జారీ చేయాలని ఈపీఎస్ డిమాండ్ చేస్తున్నారని, అన్నాడీఎంకే హయాంలో కుదిరిన ఒప్పందాల ప్రకారం 10 శాతం కూడా పెట్టుబడులు పెట్టలేదనడానికి తన వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. వాటితో శ్వేతపత్రం జారీ చేస్తే ఆయనకే అవమానమని అన్నారు.



ఏచూరి పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న మంత్రి ఉదయనిధి, ఎంపీ దయానిధి, సీపీఎం రాష్ట్ర నేతలు బాలకృష్ణన్, రామకృష్ణన్ తదితరులు

ఏచూరికి మంత్రి ఉదయనిధి నివాళి

పెరంబూర్, సెప్టెంబరు 14: అనారోగ్యంతో కన్నుమూసిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పార్థివదేహానికి రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి నివాళులర్పించారు. ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రిలో న్యుమోనియాతో బాధపడుతూ చికిత్స పొందుతూ ఏచూరి బుధవారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన పార్థివదేహాన్ని గురువారం ఢిల్లీలోని ఆయన స్వగృహానికి తరలించారు. శుక్రవారం ఉదయం పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి ఉదయనిధి, డీఎంకే పార్లమెంటు పక్ష నేత టీఆర్ బాలు, ఆ పార్టీ ఎంపీలు దయానిధి మారన్, కనిమొళి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్, రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు జి.రామకృష్ణన్, సీపీఎం ఎంపీలు వెంకటేశన్, సచ్చిదానందం, డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ తదితరులు ఢిల్లీ వెళ్లి ఏచూరి పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు ఏచూరితో తమ అనుబంధాన్ని స్మరించుకున్నారు.



స్వర్ణరథాన్ని లాగుతున్న మంత్రులు పీకే శేఖర్‌బాబు, ఆర్ గాంధీ, దేవాదాయ శాఖ అధికారులు

పెరియపాళయం ఆలయానికి రూ.8.54 కోట్లతో స్వర్ణ రథం

- ప్రారంభించిన మంత్రులు

చెన్నై, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట సమీపంలోని పెరియపాళయం భవాని అమ్మవారి ఆలయంలో రూ.8.54 కోట్లతో నిర్మించిన స్వర్ణరథ ప్రారంభోత్సవం శనివారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. మంత్రులు పీకే శేఖర్‌బాబు, ఆర్ గాంధీ, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఆ రథాన్ని లాగి ఆలయం నలువైపులా ఊరేగించారు. 11 కిలోల బంగారం, 27.5 కిలోల వెండి, 379 కిలోల రాగిని మిశ్రమంగా తయారు చేసి ఈ రథాన్ని నిర్మించారు. 11.5 అడుగుల ఎత్తు, 5 అడుగుల వెడల్పు, 6.5 అడుగుల పొడవుతో ఈ రథాన్ని సర్వాంగ సుందరంగా రూపొందించినట్లు మంత్రి శేఖర్‌బాబు తెలిపారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యేలు టీకే గోవిందరాజన్, కృష్ణసామి, దురై చంద్రశేఖర్, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్, అడిషనల్ కమిషనర్ సుకుమార్, తిరువళ్లూరు జిల్లా రెవెన్యూ అధికారి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదంలో ధ్వంసమైన వ్యాన్, కారు

రోడ్డు ప్రమాదంలో నలుగురి మృతి

- అందరిదీ ఒకే కుటుంబం
- శివగంగ జిల్లాలో విషాదం

పెరంబూర్, సెప్టెంబరు 14: శివగంగ జిల్లా దేవకోట సమీపంలో వ్యాన్‌ను కారు ఢీకొన్న ఘటనలో నలుగురు మృతి చెందగా, మరో 11 మందికి గాయాలయ్యాయి. మలేసియా నుంచి ఆధ్యాత్మిక యాత్రకు వచ్చిన 12 మంది రామనాథపురం జిల్లా రామేశ్వరం నుంచి తిరుచ్చికి శనివారం ఉదయం బయల్దేరారు. వ్యాన్‌ను మదురైకి చెందిన కాంతయ్య (40) నడిపాడు. అదే సమయంలో, తంజావూరులో టీ దుకాణం నడుపుతున్న పౌల్ డేనియేల్(38) తన కుమార్తెలు సూసన్ రేహామా (10), హెలన్ సామా (7), చిన్నాన్న మైఖేల్ (63) తదితరులు బంధువుల ఇంటి శుభకార్యానికి కారులో బయల్దేరారు. శివగంగ జిల్లా దేవకోట సమీపంలో మధ్యాహ్నం 12.30 గంటలకు డేనియల్ నడుతుపుతున్న కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు చనిపోయారు. వ్యానులో ప్రయాణిస్తున్న పదిమంది మలేసియా పర్యాటకులు, వ్యాన్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. చుట్టుపక్కల ప్రజలు క్షతగాత్రులను 108 అంబులెన్స్‌ల ద్వారా దేవకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక డేనియల్, ఇద్దరు కుమార్తెలు, చిన్నాన్న మృతి చెందారు. ఈ ఘటనపై దేవకోట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

డీఎండీకే 20వ వ్యవస్థాపక వేడుకలు ప్రారంభం

- జెండాను ఆవిష్కరించిన ప్రేమలత
- పార్టీ ఆఫీసుకు కెప్టెన్ ఆలయంగా నామకరణం



విజయకాంత్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రేమలత

అడయార్, సెప్టెంబరు 13: డీఎండీకే 20వ వ్యవస్థాపక దిన వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలను పురస్కరించుకుని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత స్థానిక కోయంబేడులోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. పార్టీ వ్యవస్థాపక దినోత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించడంతో పాటు అనేక మంది పేదలకు సంక్షేమ సహాయాలను పార్టీ శ్రేణులు పంపిణీ చేస్తున్నాయన్నారు. పార్టీ వ్యవస్థాపకుడు దివంగత విజయకాంత్‌కు కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణ్ పురస్కారం ప్రకటించడం, కెప్టెన్ 72వ జయంతి వేడుకలు, పార్టీ 20వ వ్యవస్థాపక దినోత్సవాలను కలిపి ముప్పెరు విళాగా జరుపుకుంటున్నట్లు వెల్లడించారు. కెప్టెన్ లేకుండా పార్టీ వ్యవస్థాపక వేడుకలను జరుపుకోవడం ఇదే తొలిసారన్నారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో పతాకాన్ని ఆవిష్కరించి, మెగా వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇకపై పార్టీ ప్రధాన కార్యాలయాన్ని కెప్టెన్ ఆలయంగా నామకరణం చేసినట్టు చెప్పారు. దేశంలో జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరి జీవితాల్లో కష్టకాలం ప్రారంభమైందంటూ అన్నపూర్ణ హోటల్ యజమాని ప్రశ్నించారన్నారు. ఇది మీడియాలో ప్రసారం కావడంతో ఆయన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి తన వివరణ ఇచ్చి, క్షమాపణలు చెప్పారన్నారు. ఈ విషయాన్ని మీడియా పెద్దది చేసిందన్నారు. మహావిష్ణు అంశాన్ని పెద్దగా చూడాల్సిన అవసరం లేదన్నారు.

పెట్టుబడులపై శ్వేతపత్రం

ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఇప్పటివరకు పలు విదేశాలకు వెళ్లారని, ఈ పర్యటనల ఫలితంగా రాష్ట్రానికి వచ్చిన కొత్త పరిశ్రమలు, పెట్టుబడులపై ప్రభుత్వం శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కాగా, పార్టీ వ్యవస్థాపక దినోత్సవాల్లో డీఎండీకేకు చెందిన అనేక మంది సీనియర్ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కాగా ఈ వేడుకల సందర్భంగా పార్టీ తరఫున పేదలకు పలు సహాయాలు అందించారు. అదేవిధంగా శనివారం ప్రభుత్వాసుపత్రుల్లో జన్మించిన 20 మంది చిన్నారులకు కోయంబత్తూరులో పార్టీ యువనేత, విజయకాంత్ తనయకుడు వి.విజయ్ ప్రభాకరన్ బంగారు ఉంగరాలను బహూకరించారు.

అధికారంలో భాగస్వామ్యం అవశ్యం

- వీడియోతో స్టాలిన్‌కు తిరుమా షాక్!



వీడియోలో ఉద్వేగంగా ప్రసంగిస్తున్న తిరుమావళవన్

చెన్నై, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): డీఎంకే మిత్రపక్షమైన డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ అమెరికా పర్యటనను దిగ్విజయంగా ముగించుకుని చెన్నైకి తిరిగొచ్చిన ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఓ వీడియోను విడుదల చేసి షాక్ ఇచ్చారు. అధికారంలో భాగస్వామ్యం అవసరమని తిరుమావళవన్ గతంలో చేసిన దృశ్యాలు ఆ వీడియోలో ఉండడం గమనార్హం. స్టాలిన్ విమానాశ్రయంలో దిగి డీపీఐ మద్య నిషేధ మహానాడు వెనుక ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని విలేకరులకు చెప్పిన కాసేపటికల్లా తిరుమావళవన్ ఎక్స్ పేజీలో ఈ వీడియో వెలువడడం సంచలనం రేపుతోంది. ఆ వీడియోలో 'రాష్ట్రంలో ఎవరూ వ్యతిరేకించి మాట్లాడ కూడదు.. ఉన్నత పదవులకు ఆశ పడకూడదు.. పాలనలో, అధికారం భాగస్వామం కోరకూడదనే పరిస్థితులు ఉండేవి.. అయితే 2016లో నుంచి తొట్ట తొలుత సంకీర్ణ ప్రభుత్వం కావాలంటూ పిలుపునిచ్చింది మేమే. పాలనలో, అధికారంలో భాగస్వామ్యం కావాలని అడుగుతున్నాం. మారుమూలలో ఉన్న సామాన్యుడికి ప్రజాస్వామ్య ఫలాలు అందాలి. పామరులకు సైతం అధికారం ఉండాలి.. ఇవన్నీ నిర్భయంగా మాట్లాడగల సత్తా డీపీఐకే ఉంది' అంటూ తిరుమా ఉద్వేగంగా ప్రసంగిస్తున్న దృశ్యాలున్నాయి.

పాత వీడియో...

తిరుమావళవన్ ఎక్స్ పేజీలో శనివారం ఉదయం వెలువడిన వీడియో పాతదని, కొన్నేళ్లకు మునుపు వెలువరించిన ఆ వీడియోను ఆయన తొలగించగా, మళ్లీ ఇప్పుడు ఎక్స్ పేజీలో ప్రత్యక్షం కావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని డీపీఐ నాయకులు చెబుతున్నారు. ఈ వీడియోను మళ్లీ తన ఎక్స్ పేజీలో వెలువరించి ప్రస్తుతం డీఎంకే మిత్రపక్షంగా ఉన్న తమ పార్టీకి మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరుతున్నారనే భావన కలిగిస్తోందన్నారు.

ఆ వీడియో సంగతి తెలియదు : తిరుమా

తాను ప్రసంగించిన పాత వీడియో ఎక్స్ పేజీలో వెలువడం గురించి తనకు తెలియదని డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ అన్నారు. మదురైలో విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ పాలనలో భాగస్వామ్యం, అధికారంలో భాగస్వామం కావాలంటూ తాము ఎప్పడి నుంచో డిమాండ్ చేస్తున్నామని, ఆ పాత వీడియో వెలువడటం తనకు తెలియదని, ఒక వేళ అడ్మిన్ వెలువరించి ఉంటాడని చెప్పారు.

గవర్నర్ పదవిపై ప్రశ్న!

- కఠినంగా గ్రూప్-2 ప్రశ్నపత్రం



స్థానిక ఎగ్మూర్ ప్రెసిడెన్సీ బాలికల పాఠశాల పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న టీఎన్‌పీఎస్సీ చైర్మన్ ప్రభాకర్

ప్యారీస్, సెప్టెంబరు 14: రాష్ట్రంలో గ్రూప్-2, 2ఏ ప్రిలిమినరీ పరీక్షకు 5.81 లక్షల మంది హాజరు కాగా, దరఖాస్తు చేసుకున్న వారిలో 2.12 లక్షల మంది గైర్హాజరవడం చర్చనీయాంశమైంది. జనరల్ నాలెడ్జ్ విభాగంలో, జనరల్ తమిళ విభాగంలో ప్రశ్నలు కాస్త కష్టంగా ఉన్నాయని పలువురు అభ్యర్థులు వ్యాఖ్యానించారు. గ్రూప్-2లో 507 పోస్టులు, గ్రూప్-2ఏ విభాగంలో 1,820 పోస్టుల భర్తీకి టీఎన్‌పీఎస్సీ ఆధ్వర్యంలో శనివారం ప్రిలిమినరీ పరీక్షలు జరిగాయి. మొత్తం 7,93,966 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగింది. చెన్నైలో 251 పరీక్షా కేంద్రాల్లో సుమారు 70,000 మంది హాజరయ్యారు. ఎగ్మూర్‌లోని ప్రెసిడెన్సీ మహిళల మహోన్నత పాఠశాల కేంద్రాన్ని టీఎన్‌పీఎస్సీ చైర్మన్ ఎస్కే ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించిన కీ వారం రోజుల్లో టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో విడుదల చేస్తామన్నారు. ఏమైనా ఆక్షేపణలుంటే తగిన ఆధారాలతో ఆన్‌లైన్‌లో తెలియజేయాలన్నారు. జవాబు పత్రాల మూల్యాంకనం రెండుమూడు నెలల్లో పూర్తిచేసి, ప్రిమిలినరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి మెయిన్స్ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. టీఎన్‌పీఎస్సీ వార్షిక టైంటేబుల్ ప్రకారం ఈ ఏడాది 10 పరీక్షలల్లో ఇప్పటికే 8 పరీక్షలు పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన 2 పరీక్షలు డిసెంబరులోపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం ఇప్పటివరకు 10,315 మందికి టీఎన్‌పీఎస్సీ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించామని, మరో 10,000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న దృష్టితో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కాగా గ్రూప్-2 ప్రిలిమ్స్‌లో జనరల్ నాలెడ్జ్, మాథ్యమెటికల్ ఆప్టిట్యూడ్‌పై 100 ప్రశ్నలు, జనరల్ తమిళ్ / జనరల్ ఇంగ్లీషుపై 100 ప్రశ్నలు ఉన్నాయి. జనరల్ నాలెడ్జ్, జనరల్ తమిళంలో ప్రశ్నలు కాస్త కఠినంగా ఉన్నాయని పలువురు అభ్యర్థులు తెలిపారు. జనరల్ ఇంగ్లీషు విభాగం ప్రశ్నలు ఎంచుకున్న వారికి సులభంగా ఉన్నాయని తెలిపారు.

కటాఫ్ మార్కులు తగ్గే అవకాశం...

ప్రిలిమినరీ పరీక్షల్లో మెయిన్స్‌కు 1 పోస్టుకు 10 మంది అభ్యర్థుల నిష్పత్తి ఆధారంగా ఎంపిక చేస్తారు. ఆ విధంగా ప్రస్తుతం 2,327 ఖాళీలు ప్రకటించగా, సుమారు 24,000 మంది మెయిన్స్ రాసేందుకు అర్హత సాధించనున్నారు. ఆ ప్రకారం, ఖాళీల సంఖ్య పెరిగితే, ఎక్కువ మంది మెయిన్స్ పరీక్ష రాసే అవకాశముంది. ప్రిలిమినరీ పరీక్ష కాస్త కష్టంగా ఉందనే అభిప్రాయం అభ్యర్థుల్లో ఉండడంతో కటాఫ్ మార్కులు తగ్గే అవకాశముంది. సాధారణంగా 200 ప్రశ్నలకు 150 లేదా 160 ప్రశ్నలకు సరిగ్గా సమాధానమిస్తే మెయిన్స్‌కు అర్హత సాధించవచ్చు. ప్రశ్నలు కఠినంగా ఉండడంతో సుమారు 140 ప్రశ్నలకు సరైన సమాధానమిస్తే మెయిన్స్‌కు అర్హత సాధించే అవకాశముందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.ఈ పరీక్షలో గవర్నర్ పదవికి సంబంధించి అడిగిన ప్రశ్న వివాదాస్పదంగా మారింది. తమిళనాడు గవర్నర్ రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారంటూ డీఎంకే కూటమి పార్టీలు విమర్శిస్తున్న నేపథ్యంలో గవర్నర్ పదవికి సంబంధించి టీఎన్‌పీఎస్సీ పరీక్షలో అడిగిన ఆ ప్రశ్న ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది.

అన్నాడీఎంకేతో పొత్తు కొనసాగుతుంది

● పుదుకోట సభలో డీఎండీకే ఉప ప్రధాన కార్యదర్శి సుధీష్

ప్యారీస్, సెప్టెంబరు 14:స్థానిక సంస్థలకు త్వరలో జరగనున్న ఎన్నికలు, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమిలో కొనసాగుతామని డీఎండీకే ఉప ప్రధాన కార్యదర్శి సుధీష్ పేర్కొన్నారు. పుదుకోటలో శనివారం డీఎండీకే 20వ వార్షికోత్సవం సందర్భంగా వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వేదిక ప్రాంగణంలో పార్టీ జెండా ఆవిష్కరించి, పేదలకు సంక్షేమ సహాయాలను సుధీష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదల జీవన శైలిని మెరుగుపరచాలన్న సంకల్పంతో కెప్టెన్ విజయకాంత్ స్థాపించిన డీఎండీకే నాలుగు అసెంబ్లీ ఎన్నికలు, నాలుగు పార్లమెంటు ఎన్నికలు, మూడు స్థానిక సంస్థల ఎన్నికలు ఎదుర్కొని బలమైన పార్టీగా స్థిరపడిందన్నారు. డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ నిర్వహిస్తున్న మద్య నిషేధ మహానాడుకు తమకు ఇంతవరకు ఆహ్వానం అందలేదన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు లేని కారణంగా బాలికలపై అత్యాచార ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. మారుమూల గ్రామాల్లో సైతం గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని, అయినా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ అమెరికాకు వెళ్లి 17 రోజులు ఉండి రూ.7,500 కోట్లు పెట్టుబడులు మాత్రమే రాబట్టారని, అయితే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడురోజుల పర్యటనగా అమెరికా వెళ్లి రూ.33,000 కోట్ల పరిశ్రమలకు సంబంధించిన పెట్టుబడులు రాబట్టారని పేర్కొన్నారు. ఫోర్డ్ సంస్థ గతంలో ఇక్కడ ఉండేదని, ఆ సంస్థ మళ్లీ స్టాలిన్ ప్రభుత్వం తీసుకొస్తోందని సుధీష్ తెలిపారు.



చిన్నారులకు ఉంగరాలు బహూకరిస్తున్న విజయ్ ప్రభాకరన్

కలైంజర్ స్మారక నాణెం ఆన్‌లైన్‌లో రూ.4,180కి విక్రయం

పెరంబూర్, సెప్టెంబరు 14: దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి స్మారక నాణెం కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో విక్రయానికి వచ్చింది. కరుణానిధి శతజయంతి సందర్భంగా ఆయన చిత్రంతో కూడిన రూ.100 నాణేన్ని కేంద్రప్రభుత్వం పరిచయం చేసింది. ఈ నాణెం ఆవిష్కరణ గత ఆగస్టు 18న చెన్నైలో జరుగగా, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విడుదల చేయగా, తొలి నాణెం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అందుకున్నారు. ఈ ప్రస్తుతం కరుణానిధి స్మారక నాణెం ఆన్‌లైన్‌లో విక్రయానికి ఉంచారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారిక వెబ్‌సైట్ https://www.indiagovtmint.in/ en/product/birth-centenary-of-kalaignar-m-karunanidhi-rs-100-unc-coin-3-folder-pack/ ద్వారా రూ.100 విలువైన నాణెం రూ.4,180కి విక్రయించనున్నారు. కాగా, డీఎంకే ప్రధాన కార్యాలయంలో కరుణానిధి స్మారక నాణేన్ని రూ.10,000 విక్రయించనున్నట్లు పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించగా, అది ఎక్కువ ధర అనే విమర్శలు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం కరుణానిధి స్మారక నాణెం ధర రూ.2,500గా నిర్ణయించగా, ప్రస్తుతం ఆన్‌లైన్‌లో 4,180కి విక్రయించనున్నారు.

వేళచ్చేరి జలాశయంలో పూడికతీత

ఐసిఎఫ్, సెప్టెంబరు 14: వర్షాకాలంలో వరదలు ఏర్పడడాన్ని అడ్డుకొనేలా స్థానిక వేళచ్చేరి జలాశయంలో రూ.23.5 కోట్లతో పూడికతీత పనులు చేపట్టనున్నారు. ఈ జలాశయాన్ని పునరుద్ధరించేందుకు సీఎండీఏ చర్యలు చేపట్టింది. పూడికతీత పనులు పూర్తయితే అదనంగా 22 శాతం మేర నీరు నిల్వచేయవచ్చు. దీన్ని తాగునీరు ఆధారంగా మార్చేందుకు చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో, వర్షాకాలంలో వేళచ్చేరిలో వరదలు ఏర్పడడాన్ని అడ్డుకొనేందుకు ఈ జలాశయం చుట్టూ ఉన్న ఆదంబాక్కం, మడిపాక్కం, కీల్‌కట్టలై, నారాయణపురం, పళ్లికరనై తదితర ఐదు జలాశయాల్లో పూడికతీత చేపట్టనున్నారు.

కేంద్ర మంత్రి నిర్మల క్షమాపణ చెప్పాలి

● మాజీ సీఎం నారాయణ స్వామి డిమాండ్

పుదుచ్చేరి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులో తలెత్తిన వివాదానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత నారాయణ స్వామి డిమాండ్ చేశారు. ఆయన శనివారం పుదువైలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. జీఎస్టీ అంశంపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోవై అన్నపూర్ణ హోటల్ యజమాని అడిగిన ప్రశ్నలో ఎలాంటి దోషం లేదన్నారు. సింగపూర్, ఐరోపా దేశాల్లో ఈ తరహాలోనే ఒకే పన్ను విధానం అమల్లో ఉందన్నారు. జీఎస్టీ పన్ను విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టినప్పటికీ దాన్ని ప్రధాని నరేంద్రమోదీ సర్కారు పూర్తి మార్పి వేసిందన్నారు. పైపెచ్చు జీఎస్టీ పన్ను విధానంపై ఒక వ్యక్తి స్వేచ్ఛగా మాట్లాడలేని నిర్బంధ పరిస్థితిని ప్రధాని మోడీ సర్కారు కల్పించిందన్నారు. అందుకే కోయంబత్తూరు జరిగిన వివాదంపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఎమ్మెల్యే వానతి శ్రీనివాస్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

83.5 లక్షల మందికి పాస్‌పోర్టుల పంపిణీ

ఐసిఎఫ్, సెప్టెంబరు 14: రాష్ట్రంలో గత ఏడాది 83.55 లక్షల మందికి అధికారులు పాస్‌పోర్టులు పంపిణీ చేశారు. ఉద్యోగం, విద్య, పర్యటన వంటి వివిధ అవసరాలకు భారతీయులు విదేశాలకు వెళ్తున్నారు. దీంతో పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకొనే వారి సంఖ్య పెరుగుతోంది. గత 2023లో మాత్రమే 3,08,93,557 మంది మహిళలు, 5,73,77,716 మంది పురుషులు అని మొత్తం 8,82,71,293 మంది పాస్‌పోర్ట్ పొందినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. వారిలో రాష్ట్రంలో 28,07,509 మంది మహిళలు, 55,47,383 మంది పురుషులు అని మొత్తం 83,54,892 మంది పాస్‌పోర్ట్ పొందినట్లు అధికారులు తెలిపారు.

రేపు పాస్‌పోర్ట్ దరఖాస్తుదారుల ఇంటర్వ్యూ

ఐసిఎఫ్, సెప్టెంబరు 14: పాస్‌పోర్ట్ దరఖాస్తుదారుల ఇంటర్వ్యూలు సోమవారం జరుగనున్నాయి. పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఆయా కార్యాలయాల్లో ఈనెల 17వ తేది జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని చెన్నై మండల పాస్‌పోర్ట్ అధికారి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, మిలాద్ ఉన్ నబి పండుగను పురస్కరించుకొని ఆ రోజు ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో, సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని దరఖాస్తుదారుల మొబైల్ నెంబర్లకు ఎస్ఎంఎస్ పంపించామని తెలిపారు.

రూ.55,800 కోట్ల వాణిజ్య పన్ను వసూలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 14: ఈ ఆర్థిక సంవత్సరం గత ఆగస్టు వరకు వాణిజ్య పన్ను రూ.55,807 కోట్లు వసూలైంది. గత ఏడాది ఇదే సమయంలో రూ.49,716 కోట్లు వసూలైంది. దీంతో పోల్చగా, ఈ సంవత్సరం అదనంగా రూ.6,091 కోట్లు వసూలైంది. గూడ్స్, సేవా పన్నుకు సంబంధించి గత ఆగస్టు వరకు రూ.31,338 కోట్లు వసూలైంది. గత ఏడాది ఆగస్టు వరకు రూ.26,767 కోట్లు వసూలైంది. దీంతో పోల్చగా ఈ ఏడాది పన్ను 17 శాతం పెరిగింది.

129 మంది పోలీసులకు అన్నా పతకాలు

చెన్నై, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): పోలీసు, అగ్నిమాపక శాఖల్లో విధినిర్వహణలో విశిష్ట సేవలందించిన 129 మంది పోలీసులకు మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై జయంతి సందర్భంగా అన్నా పతకాలను ప్రదానం చేయనున్నట్లు శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రకటన జారీ చేసింది. తూత్తుకుడి జిల్లా శ్రీవైకుంఠం అగ్నిమాపక శాఖలో పనిచేస్తున్న మందిరమూర్తి, రామచంద్రన్ అనే ఇరువురూ గతేడాది డిసెంబర్ 18 రాత్రి తామ్రభరణి నది వరదల్లో చిక్కుకున్న 448 మందిని కాపాడారు. వీరి ధైర్యసాహసాలకు అన్నా పేరుతో ప్రత్యేక పతకాలను అందజేయనున్నారు. ఈ పతకాల ప్రదానోత్సవం జరిగే తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

ఐదు జలాశయాల్లో 33 శాతం నీటి నిల్వలు

పెరంబూర్, సెప్టెంబరు 14: చెన్నైవాసుల దాహార్తి తీర్చే ఐదు జలాశయాల్లో 33.01 శాతం నీటి నిల్వలున్నాయి. ఆ ప్రకారం, సెంబరంబాక్కం జలాశయంలో 32.07 శాతం, పుళల్‌లో 68.91 శాతం, పూండిలో 2.48 శాతం, చోళవరంలో 5.36 శాతం, కన్నన్‌కోట తేర్వాయ్‌కండిగై జలాశయంలో 60 శాతం నీటినిల్వలున్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

డీఎంకే ప్రభుత్వంలో కాంగ్రెస్‌కు భాగస్వామ్యం

● టీఎన్‌సీసీకి జిల్లా అధ్యక్షుల కోరిక



జీఎస్టీపై నిలదీసిన ఓ హోటల్ యజమానిని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బెదిరించి క్షమాపణలు చెప్పించడాన్ని నిరసిస్తూ శనివారం కోవైలో ఆందోళన చేస్తున్న తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సెల్వపెరుందగై తదితరులు

ప్యారీస్, సెప్టెంబరు 14: ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో జనసేనకు భాగస్వామ్యం కల్పించినట్లే తమిళనాట కూడా డీఎంకే ప్రభుత్వంలో చోటు కల్పించాలని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగైను పార్టీ జిల్లా అధ్యక్షులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 1967వ సంవత్సరం వరకు ముఖ్యమంత్రి కామరాజర్ నేతృత్వంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ఆ తర్వాత అధికారం కోల్పోయింది. ఆ తర్వాత డీఎంకే, అన్నాడీఎంకేలకు మద్దతుగా నిలిచి గెలిపించిన కాంగ్రెస్, మంత్రివర్గంలో చోటు కల్పించాలని ఇన్నాళ్లు పెదవి విప్పలేదు. ఈ నేపథ్యంలో, టీఎన్‌సీసీ కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో సెల్వపెరుందగై అధ్యక్షతన జరిగిన జిల్లా అధ్యక్షుల సమావేశంలో పార్టీపరంగా 77 జిల్లాలకు చెందిన ప్రధాన నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్‌కు అధికారంలో భాగస్వామ్యం కల్పించకపోవడం బాధ కలిగిస్తోందని, అందువల్ల పార్టీ బలం తగ్గిపోయే అవకాశముందని వాపోయారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నట్లే ఇక్కడ కూడా డీఎంకే కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేసి కాంగ్రెస్‌కు చోటు కల్పించాలని డిమాండ్ చేశారు.

వంతెన ప్రారంభించిన మంత్రి దురైమురగున్



వంతెన ప్రారంభిస్తున్న మంత్రి దురైమురుగన్



వేలూరు, సెప్టెంబరు 14: గుడియాత్తం నగరంలో నీటిపారుదల శాఖ తరఫున రూ.30.19 కోట్లతో తాల్యాత్తం నుంచి సేంపల్లి రోడ్డు వరకు కౌండిన్య నది కుడివైపు ఒడ్డున నిర్మించిన విద్యుద్దీపాల రహదారి, రూ.13.70 కోట్లతో గంగమ్మ ఆలయం నుంచి కౌండిన్య నది మధ్య విద్యుద్దీపాలతో నిర్మించిన వంతెనను శుక్రవారం సాయంత్రం 7.40 గంటలకు మంత్రి దురైమురుగన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మోర్దానా డ్యాంను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఎంపీ, ఎమ్మెల్యేలు కోరుతున్నారని, త్వరలో ఆ ప్రాంతాన్ని అధికారులు పరిశీలించనున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రారంభించిన నేల వంతెనకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేరు పెడతామన్నారు. ఎంపీ కదిర్ ఆనంద్, ఎమ్మెల్యేలు నందకుమార్, అమ్ములు విజయన్, కలెక్టర్ సుబ్బులక్ష్మి, జిల్లా పంచాయతీ కమిటీ అధ్యక్షుడు బాబు, వేలూరు కార్పొరేషన్ ఉప మేయర్ సునీల్‌కుమార్, గుడియాత్తం మున్సిపాలిటీ అధ్యక్షుడు సౌందరరాజన్, యూనియన్ కమిటీ అధ్యక్షుడు సత్యానందం, ఇంజనీర్ ప్రభాకరన్ తదితరులు పాల్గొన్నారు.

ఓనం పండుగకు నేతల శుభాకాంక్షలు

అడయార్, సెప్టెంబరు 14: మలయాళ ప్రజల సంప్రదాయ పండుగల్లో ఒకటైన ఓనం పండుగను పురస్కరించుకుని పలువురు రాజకీయ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విషయంపై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి, మరో మాజీ సీఎం ఓ. పన్నీర్‌సెల్వం, పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై, తమిళ మానిక కాంగ్రెస్ అధ్యక్షుడు జీకే వాసన్, పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్, అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ శనివారం వేర్వేరుగా విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఓనం పండుగ శుభ సందర్భంగా ప్రతి ఇంట్లో సుఖశాంతులు నెలకొనాలని వారు ఆకాంక్షించారు. 'అత్తం పత్తు ఓనం' పేరుతో పది రోజుల పాటు పండుగను మలయాళ ప్రజలు ఎంతో సంతోషంగా జరుపుకోవాలని ఎడప్పాడి పళనిస్వామి కోరారు. ఈ పండుగ సందర్భంగా ప్రతి ఇంట ప్రేమానురాగాలతో పాటు సుఖశాంతులు నెలకొనాలని మాజీ సీఎం ఓపీఎస్ పేర్కొన్నారు.

17న టాస్మాక్ దుకాణాలకు సెలవు

పెరంబూర్, సెప్టెంబరు 14: రాష్ట్రంలోని టాస్మాక్ దుకాణాలకు 'మిలాద్ ఉన్ నబి' సందర్భంగా ఈనెల 17వ తేది సెలవు ప్రకటించారు. టాస్మాక్ దుకాణాలు, బార్లు, చిల్లర దుకాణాలు, క్లబ్ బార్లు అన్నీ మూసివేయాలని,నిబంధనలు ఉల్లంఘించి మద్యం విక్రయాలు చేపడితే కఠిన చర్యలు చేపడతామని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. అలాగే హైకోర్టుకు కూడా సోమవారం సెలవు ప్రకటించారు.



పట్టణంబాక్కం బీచ్ సర్వీస్ రోడ్డు నుంచి ఒడ్డు వరకు నిర్మించిన ట్రాలీ మార్గం



తీరంలో సీసీ కెమెరా నిఘా

నేడు వినాయక ప్రతిమల నిమజ్జనం

● సముద్ర తీరాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

ప్యారీస్, సెప్టెంబరు 14: వినాయక చవితి పండుగ సందర్భంగా ఈ నెల 7నుంచి నగరంలో ప్రత్యేక పందిళ్లలో ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్య ప్రతిమల నిమజ్జనం, ఊరేగింపు ఆదివారం భారీ పోలీసు బందోబస్తు మధ్య జరగనుంది. పోలీసు శాఖ అనుమతించిన పట్టణంబాక్కం, కాశిమేడు, తిరువొత్తియూర్, తిరువాన్మియూర్ సముద్రతీరాల్లో ప్రత్యేక ఏర్పాట్లు సిద్ధం చేశారు. తీరానికి తరలించే విగ్రహాలను సముద్రం ఒడ్డుకు తీసుకెళ్లేందుకు భారీ క్రేన్లు ఏర్పాటు చేశారు.

సమాచార దర్శిని

రేపటి నుంచి బీఎడ్ దరఖాస్తుల స్వీకరణ

ఐసిఎఫ్, సెప్టెంబరు 14: బీఎడ్ కోర్సుల్లో చేరేందుకు ఈనెల 16నుంచి 26వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణ జరగనుంది. ఇంజనీరింగ్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు ఈ నెల 23వ తేది వరకు జరగనున్నాయి. ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో 2,040 బీఎడ్ సీట్లలో చేరేందుకు www.tngasa.inలో దరఖాస్తు చేసుకోవాలి. ర్యాంకుల జాబితా 30వ తేది విడుదల కానుంది. విద్యార్థుల అడ్మిషన్లు అక్టోబరు 14 నుంచి 19వ తేది వరకు జరగనుండగా, మొదటి సంవత్సరం తరగతులు అక్టోబరు 23న ప్రారంభం కానున్నాయి.

రేపు రిజిస్ట్రేషన్‌కు అదనపు టోకెన్లు

ఐసిఎఫ్, సెప్టెంబరు 14: ఆవణి మాసం చివరి ముహూర్త దినమైన 16వ తేది పత్రాల రిజిస్ట్రేషన్‌కు అదనపు టోకెన్లు అందజేయనున్నట్లు రిజిస్ట్రేషన్ శాఖ తెలిపింది. సోమవారం ఎక్కువ సంఖ్యలో ఆస్తుల పత్రాలు రిజిస్ట్రేషన్ జరిగే అవకాశముంది. సాధారణంగా 200 టోకెన్లు అందజేస్తుండగా అదనంగా ఒక్కో కార్యాలయంలో 300 టోకెన్ల వరకు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే, అక్టోబరులో పురటాసిని పురస్కరించుకొని జరిగే రిజిస్ట్రేషన్లకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

పెరిగిన సోలార్ విద్యుదుత్పత్తి

ఐసిఎఫ్, సెప్టెంబరు 14: రాష్ట్రంలో సోలార్ విద్యుదుత్పత్తి 6,090 మెగావాట్లకు పెరిగింది. సంవత్సరానికి 300 రోజులు సౌరవిద్యుత్ లభిస్తోంది. విరుదునగర్, శివగంగ తదితర జిల్లాల్లో ఉదయం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకు, ఇతర జిల్లాల్లో ఉదయం 6.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సూర్యరశ్మి ఆధారంగా విద్యుదుత్పత్తి జరుగుతోంది. మొత్తం సోలార్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి సామర్థ్యం 8,784 మెగావాట్లు. కాగా, వర్షాలు కురిసే సమయంలో తక్కువగాను, ఇతర రోజుల్లో 4,000 నుంచి 4,500 మెగావాట్ల వరకు ఉత్పత్తి జరుగుతోంది. ఈ నెల 7వ తేది 5,985 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరగ్గా శుక్రవారం 6,090 మెగావాట్లకు పెరిగింది.

నేడు 65 సబర్బన్ రైళ్ల రద్దు

ఐసిఎఫ్, సెప్టెంబరు 14: తాంబరం రైల్వే యార్డులో చేపడుతున్న అభివృద్ధి పనుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు 65 సబర్బన్ రైళ్లు రద్దయ్యాయి. ఈ రైళ్ల రద్దు కారణంగా ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై బీచ్ - తాంబరం మధ్య 32 ప్రత్యేక ప్యాసింజర్ రైళ్లు నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

1,000 ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 14: చెన్నై మెట్రోపాలిటన్ రవాణా సంస్థ 1,000 ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేయనుంది. ఎంటీసీలో ఒప్పంద పద్ధతిలో ప్రైవేటు ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు టెండర్లు ఆహ్వానించి, సంస్థలను ఎంపిక చేసే పనులు జరుగుతున్నాయి. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ.. 1,000 బస్సులు నడిపేందుకు టెండర్లు విడుదల చేయగా, టాటా, అశోక్ లేలాండ్ సహా ఆరు సంస్థలు ముందుకొచ్చాయని తెలిపారు. ఆరు నెలల్లో ఈ బస్సులు అంచెలంచెలుగా తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. బస్సుల ఛార్జింగ్‌కు డిపోల్లో పాయింట్లు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.

గిరి ప్రదక్షిణకు అనుకూల సమయం

పెరంబూర్, సెప్టెంబరు 14: తిరువణ్ణామలైలో ప్రపంచ ప్రసిద్ధిచెందిన అరుణాచలేశ్వర ఆలయానికి ప్రతిరోజు దేశ, విదేశాల భక్తులు వస్తుంటారు. ముఖ్యంగా, అరుణాచలేశ్వర ఆలయ వెనుక ఉన్న 'అన్నామలై' కొండ చుట్టూ 14 కి.మీ మార్గంలో పౌర్ణమి రోజుల్లో లక్షలాది భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తుంటారు. పురటాసి పౌర్ణమి నెల సందర్భంగా గిరి ప్రదక్షిణ వేళలను ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. పౌర్ణమి గడియలు ఈనెల 17వ తేది ఉదయం 11.27 గంటలకు ప్రారంభమై 18వ తేది ఉదయం 9.10 గంటల వరకు కొనసాగనున్నాయి. ఆ రోజున ప్రభుత్వ సెలవు దినం కావడంతో లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశముందని ఆలయ అధికారులు భావిస్తున్నారు.

19న గ్యాస్ వినియోగదారుల గ్రీవెన్స్

పెరంబూర్, సెప్టెంబరు 14: చెంగల్పట్టు కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 19వ తేది జిల్లా గ్యాస్ వినియోగదారుల గ్రీవెన్స్ జరగనుంది. జిల్లా రెవెన్యూ అధికారి నేతృత్వంలో ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో, గ్యాస్ వినియోగదారులు, ప్రజలు పాల్గొని, గ్యాస్ సిలిండర్లను సంబంధించిన సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని కలెక్టరేట్ పేర్కొంది.

కరుణానిధి స్మారక మండపం 23.21 లక్షల మంది సందర్శన

ఐసిఎఫ్, సెప్టెంబరు 14: దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి స్మారక మండపాన్ని 200 రోజుల్లో 23.21 లక్షల మంది సందర్శించారు. మెరీనా తీరంలో ఉన్న ఈ స్మారక మండపాన్ని ఫిబ్రవరి 26వ తేది ప్రారంభించారు. ఆ రోజు నుంచి ఇప్పటివరకు 23.21 లక్షల మంది, 'కలైంజర్ ఉలగం' మ్యూజియాన్ని 2.35 లక్షల మంది సందర్శించారు. దీన్ని ఒక రోజు సుమారుగా 1,700 మంది సందర్శించేలా రూపొందించారు.

సహకార సంఘాల్లో నగలపై రుణాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 14: సహకార సంఘాల్లో త్వరలో నగలపై రుణాలు అందించనున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. సహకార బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార రుణ సంఘాల్లో నగలపై రుణాలను అందిస్తున్నారు. బంగారు విలువలో 75 శాతం వరకు అందజేసే రుణాలను అసలు, వడ్డీ చెల్లింపులో జాప్యం చేస్తే ఇతర రుణ సంఘాల్లా కాకుండా నగలు వేలం వేస్తున్నారు. దీంతో పలువురు సహకార సంస్థల్లో నగలపై రుణాలు పొందేందుకు ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 115 సహకార విక్రయ సంఘాలున్నాయి. అవి రేషన్ దుకాణాలు నిర్వహించడంతో రైతులకు వ్యవసాయ ఉపకరణాలను అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, అన్ని సహకార సంఘాల ఆదాయం పెంచేలా నగలపై రుణాలు అందజేయాలని సహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

పళని మురుగన్ ఆలయ హుండీ ఆదాయం రూ.5.5 కోట్లు

ఐసిఎఫ్, సెప్టెంబరు 14: దిండుగల్ జిల్లా పళని మురుగన్ ఆలయ హుండీ ఆదాయం రూ.5.5 కోట్లు అని ఆలయ అధికారులు తెలిపారు. ఈ ఆలయంలో కానుకల లెక్కింపు ఇటీవల జరగ్గా, రూ.3,32,50,873 నగదు, 1,237 గ్రాముల బంగారు ఆభరణాలు, 21,638 గ్రాముల వెండి వస్తువులు, 1,012 విదేశీ కరెన్సీ భక్తులు కానుకగా సమర్పించారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం రెండో రోజు జరిగిన లెక్కింపులో 100 మందికి పైగా విద్యార్థులు, బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. రూ.2,32,28,564 నగదు, 375 గ్రాముల బంగారు ఆభరణాలు, 6,611 గ్రాముల వెండి వస్తువులు, 722 విదేశీ కరెన్సీ ఉన్నాయి.

కృష్ణా జలాలు ప్లీజ్..!

ఏపీని కోరనున్న అధికారులు ● త్వరలో అమరాతికి పయనం

అడయార్, సెప్టెంబరు 14: చెన్నై మహానగర వాసుల దాహార్తిని తీర్చేందుకు కృష్ణా జలాలలను విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరేందుకు రాష్ట్ర జల వనరుల శాఖ ఉన్నతాధికారులు అమరావతి వెళ్లనున్నారు. చెన్నై నగరానికి పుళల్, చెంబరంబాక్కం, పూండి, చోళవరం, తేర్వాయ్ కండ్రిక, వీరాణాం ప్రాజెక్టు నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే, తెలుగు గంగ కాలువ ద్వారా కృష్ణా జలాలను చెన్నై నగరానికి ఏపీ ప్రభుత్వం యేడాదికి రెండుసార్లు విడుదల చేస్తుంది. అయితే, ఈ యేడాది ఏపీలోని జలాశయాల్లో నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో కృష్ణా జలాల విడుదలలో జాప్యం నెలకొంది. అదే సమయంలో నగరంలోని చెరువుల్లో నీటి నిల్వ శాతం గణనీయంగా తగ్గిపోయింది. ప్రస్తుతం ఉన్న నీరు నవంబరు వరకు మాత్రమే వచ్చే అవకాశం ఉంది. ఆ తర్వాత నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. దీంతో కృష్ణా జలాలను పొందేలా అధికారులు దృష్టిసారించారు. ఇందుకోసం ఏపీ ప్రభుత్వంతో చర్చలు జరిపి, కృష్ణా జలాలను విడుదల చేయాలని వారు కోరనున్నారు. ఇందుకోసం త్వరలోనే రాష్ట్ర అధికారుల బృందం విజయవాడ నగరానికి వెళ్లి, చెన్నై నగర వాసుల దాహార్తిని తీర్చేందుకు వీలుగా వెయ్యి మిలియన్ నీటిని విడుదల చేయాలని కోరనున్నారు. ఈ బృందంలో జలవనరుల శాఖ, చెన్నై మెట్రో వాటర్ బోర్డుకు చెందిన ఉన్నతాధికారులు ఉంటారని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

బంగాళాఖాతంలో అల్పపీడనం

● నేటినుంచి రాష్ట్రంలో వర్షాలు

● 9 ఓడరేవుల్లో 1వ నెంబరు తుఫాను హెచ్చరిక

ప్యారీస్, సెప్టెంబరు 14: బంగ్లాదేశ్‌ను ఆనుకొని ఉన్న అల్పపీడనం పశ్చిమ - వాయువ్య దిశగా కదిలే అవకాశముందని, దీని ప్రభావం వల్ల రాష్ట్రంలో ఆదివారం నుంచి భారీ నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడనం రాష్ట్రానికి అతి దగ్గరగా సమీపిస్తుండడంతో ముందు జాగ్రత్త హెచ్చరికల కింద చెన్నై, కడలూరు, నాగపట్టినం, ఎన్నూర్, కాట్టుపల్లి, పాంబన్, తూత్తుకుడి, కారైక్కాల్, పుదుచ్చేరి ఓడ రేవుల్లో 1వ నెంబరు తుఫాను హెచ్చరిక జారీ చేశారు. 16, 17 తేదీల్లో దక్షిణ తమిళనాడు కోస్తా జిల్లాలు ఆనుకొని ఉన్న కన్నియాకుమారి సముద్ర ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని, ఈ ప్రాంతాలతో పాటు పుదుచ్చేరిలోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. వాతావరణంలో ఏర్పడిన మార్పులను బట్టి ఈ నెల 19వ తేది వరకు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని ఐఎండీ హెచ్చరించింది.

13 ఏళ్ల బాలికకు గర్భం

యువకుడి అరెస్ట్

పెరంబూర్, సెప్టెంబరు 14: బాలికను గర్భిణిని చేసిన యువకుడిని పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు. విల్లుపురం జిల్లాకు చెందిన యువకుడు తాంబరంలో బస చేస్తూ కూలి పనులకు వెళ్తుండేవాడు. అతను అదే ప్రాంతానికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు. కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్న బాలికను తల్లిదండ్రులు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా, ఆమె గర్భంతో ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో, బాధిత బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన మహిళా పోలీసులు, యువకుడిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో 18 మందికి గాయాలు



ఘటనలో ధ్వంసమైన వాహనాలు

వేలూరు, సెప్టెంబరు 14: కొనవట్టం సమీపం లో సంభవించిన రోడ్డు ప్రమాదంలో 18 మంది గాయపడ్డారు. చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో శనివారం ఉదయం చెన్నై నుంచి బెంగళూరుకు కారు వెళుతోంది. కొనవట్టం సమీపంలో వస్తున్న కారుకు అడ్డుగా ఓ పిల్లి పరుగులు తీసింది. దీంతో డ్రైవర్ బ్రేక్ వేయడంతో వెనుకగా వస్తున్న కంటైనర్ లారీ కారును ఢీకొంది. అదే సమయంలో కంటైనర్ లారీకి వెనుకగా వస్తున్న ప్రభుత్వ బస్సు లారీని ఢీకొంది. ఈ ఘటనలో కారు, ప్రభుత్వ బస్సులో ప్రయాణిస్తున్న 18 మందికి గాయాలయ్యాయి. వేలూరు దక్షిణం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను వేలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కారణంగా చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిపై గంట పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

గుట్కా విక్రేతల అరెస్టు

అడయార్, సెప్టెంబరు 14: సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో గంజాయి ప్యాకెట్లను కలిగివున్న ఇద్దరు మహిళా ప్రయాణికులను ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎర్నాకుళం నుంచి చెన్నై సెంట్రల్‌కు ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చింది. ఈ రైలులో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు ఆర్పీఎఫ్ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఆర్పీఎఫ్ పోలీసులు ఎస్1 బోగీలో ఇద్దరు మహిళల బ్యాగులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో గంజాయి ప్యాకెట్లను గుర్తించి, వారిని అరెస్టు చేశారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

విద్యార్థినిని మందు పార్టీకి పిలిచిన ప్రొఫెసర్ అరెస్టు

చెన్నై, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరునెల్వేలి సమీపం పాళయం కోట వద్దనున్న ఓ కాలేజీలో చదువుతున్న పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థినిని మందు పార్టీకి రమ్మంటూ ఒత్తిడి చేసిన ప్రొఫెసర్ జెబస్టీన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి మరో ప్రొఫెసర్ ఆచూకీ కోసం గాలిస్తున్నారు. తిరుచెందూరుకు చెందిన జెబస్టీన్, తూత్తుకుడికి చెందిన పాల్‌రాజ్ ఈనెల 4న తిరునల్వేలిలోని ఓ లాడ్జిలో పీకలదాకా మద్యం తాగారు. ఆ తర్వాత పీజీ కోర్సు చదువుతున్న విద్యార్థినికి ఫోన్ చేసి తమతో కలిసి మద్యం తాగేందుకు రమ్మంటూ ఒత్తిడి చేశారు. దీవతో దిగ్భ్రాంతి చెందిన ఆ విద్యార్థిని తల్లిదండ్రులకు తెలపటంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ జరిపి ఆ ఇద్దరు ప్రొఫెసర్లను అరెస్టు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. ప్రొఫెసర్ జబస్టీన్‌ను అరెస్టు చేశారు. ప్రొఫెసర్ పాల్‌రాజ్ పరారీలో ఉండటంతో అయన ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఇదిలా ఉండగా విద్యార్థినిని మందుపార్టీకి పిలిచిన ఆ ఇద్దరు ప్రొఫెసర్లు కళాశాల యాజమాన్యం డిస్మిస్ చేస్తూ ఉత్తర్వు జారీ చేసింది.

రౌడీ హత్యకేసులో ఆరుగురి అరెస్టు

చెన్నై, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెడ్‌హిల్స్ సమీపం ఆత్తూరు వీజీపీ మేడు ప్రాంతానికి చెందిన రౌడీ ధనుష్ హత్య కేసుకు సంబంధించిన ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఉదయం ఇంట్లో ఉన్న ధనుష్‌ను గుర్తు తెలియని ఆరుగురు వ్యక్తులు వేటకొడవళ్లతో దాడి జరిపి దారుణంగా హత్య చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని కుమార్, కార్తీక్, మణికంఠన్,అయ్యప్పన్, సంతోష్, మోహన్‌కుమార్‌ను అరెస్టు చేశారు.



రాజ్‌భవన్‌లో డాక్టర్ డీకే హరి, డాక్టర్ డీకే హేమాహరి 'తమిళనాట శ్రీరాముడు - విడదీయలేని అనుబంధం' పేరిట రచించిన ఆంగ్ల గ్రంథాన్ని శనివారం ఆవిష్కరిస్తున్న గవర్నర్ రవి, మాజీ మంత్రి డాక్టర్ హెచ్‌వీ హండే, ఆడిటర్ గురుమూర్తి తదితరులు



వేలూరులోని ప్రభుత్వ ముస్లిం ఉన్నత పాఠశాలలో శనివారం టీఎన్‌పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్-2, 2ఏ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి



తరాలనాటి విదేశీ వ్యాపారానికి సాక్ష్యం 'తరంగంబాడి'

సుప్రభాత సమయాన సముద్ర తరంగాల హోరు ఓ పక్క... స్వచ్ఛమైన గాలినాస్వాదిస్తూ ఒడ్డున నడక సాగించే జనాలు మరో పక్క... గాలినంతా పవిత్రత నింపుతూ దేవాలయాల నుంచి వినిపించే భక్తిగీతాలు ఇంకో పక్క... వెరసి 'తరంగంబాడి'... ఒకప్పటి 'ట్రాంకోబార్'..

- వేళచ్చేరి

● అదే ఒకప్పటి 'ట్రాంకోబార్' ● చరిత్రను చాటి చెప్పే కోటలు... బాటలు

కాలాన్ని సూచిస్తూ గడియారం గంటలు కొడుతుంటే, గంటకు... గంటకు మధ్య విరామంలో చర్చిలోని గీతాలు కర్ణపేయంగా వినిపిస్తుంటే.... సముద్ర జలాలు, తీరం కలుషితం కానివ్వరాదన్న మాటలు మూడు పూటలా మైకులో ప్రతిధ్వనిస్తుంటే... ఆ బీచ్ ఒడ్డున ఆల్చిప్పలను ఏరుకుంటున్న పిల్లల ముగ్ధత్వం మనసును మరో లోకాలకు తీసుకెళుతుంది. సముద్రం ఒడ్డున ఒకప్పటి డెన్మార్క్ పాలనకు సాక్షీభూతంగా నిలిచి ఉన్న కోట ఇప్పుడు మౌనంగా అన్నిటినీ గమనిస్తూ పాత జ్ఞాపకాలను నెమరేస్తున్నట్లుంటుంది...

ఆనాటి డానిష్ సంస్కృతికి అద్దం పట్టే ట్రాంకోబార్ నేటికీ అలనాటి భవనాలతో సందర్శకులను ఇట్టే కట్టిపడేస్తోంది. ఒకప్పుడు డెన్మార్క్ వారు ఇక్కడికి వ్యాపారం కోసం వచ్చి స్థిరపడి వారి కోసం నిర్మించుకున్న భవనాలు, చర్చిలు నేటికీ 'మా దర్పం తగ్గలేదు' అన్నట్లు ఠీవిగా నిలబడి ఉన్నాయి. కొన్ని భవనాలు కాలానుగుణంగా శిథిలావస్థకు చేరుకొని చిన్నచిన్న మార్పులతో పునరుజ్జీవం పొందాయి.

తంజావూరు రాజుతో ఒప్పందం

మన దేశం ప్రకృతి వనరులకు ఆలవాలమని ప్రపంచం ఎరిగిన విషయమే. వ్యాపారానికి అనువైనదని విదేశీయులు ఎప్పుడో గ్రహించి మన దేశంతో పురాతన కాలం నుండి వ్యాపార లావాదేవీలు జరిపేవారు. అలాగే డెన్మార్క్ వారు కూడా వ్యాపార నిమిత్తం 1620 ప్రాంతంలో కోరమండల తీరప్రాంతానికి వచ్చారు. తంజావూరుని పాలించిన రఘునాథ నాయకుడితో అప్పటి డెన్మార్క్ రాజు ఒప్పందం కుదుర్చుకున్నాడు. సంవత్సరానికి ఒకసారి కప్పం చెల్లించే విధంగా కోరమండల తీరప్రాంతంలోని ట్రాంకోబార్‌పై పాలన అధికారాన్ని చేజిక్కించుకున్నాడు. అక్కడ 'డాన్స్ బోర్గ్' కోట నిర్మాణం చేపట్టారు. ట్రాంకోబార్ ప్రాంతమంతా దాదాపు 225 సంవత్సరాలు డానిష్ పాలనలో ఉంది. అప్పట్లో ఎన్నో డెన్మార్క్ కుటుంబాలు ఇక్కడికి వలస వచ్చాయి. ఉద్యోగాల నిమిత్తం ఎందరో ఇక్కడికి వచ్చి గృహాలు నిర్మించుకొని స్థిరపడ్డారు. డెన్మార్క్ పాలన అంతమైనా దాని ఆనవాళ్లు నేటికీ సజీవంగా నిలిచి ఉన్నాయి. డాన్స్‌బోర్గ్ కోట, చర్చిలు, గవర్నర్ నివసించిన భవనాలు, కాలనీ ప్రవేశ ద్వారం, విద్యాలయాలు, ఇళ్లు, విశాలమైన వీధులు ఒకప్పటి డెన్మార్క్ పాలనకు ప్రతీకలుగా కనిపిస్తాయి.

ట్రాంకోబార్ పూర్వ చరిత్ర....

డెన్మార్క్ వారు ఎంతోదూరం ప్రయాణించి ఇక్కడికి ఎందుకు వచ్చారు? అసలు ఎప్పుడు వచ్చారు? వారి రాకలోని అంతర్యం ఏమిటి? ఇవన్నీ తెలుసుకోవాలంటే మనం 17వ శతాబ్దానికి వెళ్లాల్సిందే..

విస్తరణ... ముగింపు

నాయక రాజులతో మొదట జరిగిన ఒప్పందం ప్రకారం ట్రాంకోబార్ మీద మాత్రమే డెన్మార్క్ వారికి అధికారం ఉండేది. కాని వారి వ్యాపార విస్తరణకు ఆ ఒక్క ప్రాంతం చాలకపోవడంతో 1670లో ఒడంబడిక పొడిగించుకున్న సందర్భంలో పొరయార్, తిల్లిలి, ఎరికుటన్‌చేరి ఇంకా కొన్ని చిన్న జిల్లాలపై కూడ అధికారం సంపాదించుకున్నారు. 18వ శతాబ్దివరకు ఈ ప్రాంతం అంతా డెన్మార్క్ వారి పాలనలో ఉండి వారి వ్యాపారాభివృద్ధికి కేంద్రంగా మారింది. 18వ శతాబ్ది ప్రథమ భాగంలో ట్రాంకోబార్, మిగిలిన ప్రాంతాలు ఇంగ్లీషు వారి అధీనంలోకి వెళ్లడంతో అక్కడ డానిష్ పాలనకు ముగింపు వచ్చింది.

ట్రాంకోబార్‌లో దర్శనీయ స్థలాలు...

ట్రాంకోబార్‌లో ముఖ్యంగా చూడదగినది డానిష్ ఫోర్ట్. ఈ కోట 1620 సంవత్సరంలో సముద్రం ఒడ్డున నిర్మించబడింది. డెన్మార్క్ సంస్కృతికి, భవన నిర్మాణశైలికి నిలువెత్తు నిదర్శనం. ప్రస్తుతం కోటలోని ఒక అంతస్తులో ఉన్న మ్యూజియంలో అప్పటి వస్తువులెన్నో భద్రపరచబడి ఉన్నాయి. డెన్మార్క్ వారు తంజావూరుని పాలించిన రఘునాథ నాయకుడితో చేసుకున్న ఒడంబడిక నేటికీ అక్కడ భద్రంగా ఉంది. తాళపత్రాలపై లిఖించబడిన ఆ ఒడంబడికపై డానిష్ ముద్ర కూడా మనకి స్పష్టంగా కనిపిస్తుంది. వారి వ్యాపారానికి సాక్షీభూతం ఈ తాళపత్రాలు. రఘునాథ నాయకుడు అప్పటి డెన్మార్క్ గవర్నర్‌కి పంపిన బహుమతులు,కత్తులు,యుద్ధసామగ్రి మొదలైన వస్తువులు కూడా మ్యూజియం లో ఉన్నాయి. ఇక్కడ తవ్వకాల్లో లభించిన మరెన్నో వస్తువులు కూడా ఇక్కడ మనం చూడవచ్చు.

ప్రవేశ ద్వారం...

ట్రాంకోబార్ లోనికి ప్రవేశించే ముందు పెద్ద ప్రవేశ ద్వారం పర్యాటకులకు స్వాగతం పలుకుతుంది. ఏ మాత్రం చెక్కుచెదరక ఆనాటి డెన్మార్క్ వారి కళానైపుణ్యానికి తార్కాణంగా నిలిచి ఉంది. ఆ ప్రవేశ ద్వారం గుండా లోనికి వెళితే విశాలమైన వీధులు, దృఢమైన భవనాలు, చర్చిలు కనువిందు చేస్తాయి.

మత ప్రచారం...

డానిష్ పాలనలో ఎంతోమంది డెన్మార్క్ వారు వచ్చి ఇక్కడే స్థిరపడిపోవడంతో మరణించిన వారి కోసం న్యూ స్ట్రీట్‌లో నిర్మించబడిన డానిష్ సిమెట్రీ వారు ఒకప్పుడు ట్రాంకోబార్‌లో నివసించారన్న దానికి గుర్తుగా మిగిలి ఉంది. 17వ శతాబ్దంలో ఎంతోమంది క్రిస్టియన్ మిషనరీలు ట్రాంకోబార్ వచ్చి స్థిరపడ్డారు. వారి మత ప్రచారం కోసం తమిళ భాషను కూడా నేర్చుకొని తమిళ ప్రింటింగ్ ప్రెస్ కూడా స్థాపించారు. బైబిల్‌ని తమిళ భాషలో ప్రచురించారు. ది డానిష్ జియాన్ చర్చి, జింజెన్‌బాగ్ స్మారకం, న్యూ జెరూసలెమ్ చర్చి మొదలైనవి పర్యాటకులను ఆకర్షిస్తాయి. క్వీన్ స్ట్రీట్‌లో కమాండర్ భవనం ఉండేది. అది తర్వాత హాస్పిటల్‌గా మార్పు చెందింది. ట్రాంకోబార్‌లో కింగ్స్ స్ట్రీట్, క్వీన్స్ స్ట్రీట్, గోల్డ్ స్మిత్ స్ట్రీట్, పరేడ్ గ్రౌండ్ మొదలైన పేర్లతో వీధులు ఎంతో విశాలంగా ఉండి చూపరులకు ఇప్పటికీ ఆకర్షణగా నిలిచి ఉన్నాయి.

సముద్రతీరంలో ఉన్న పురాతన శివాలయం కూడా చూడదగినదే. బీచ్‌లో ఉదయాన్నే నడిచే జనం శివాలయం నుంచి ప్రసారమయ్యే భక్తిగీతాలను ఆస్వాదిస్తుంటారు. ఆ గుడి వెనుక భాగంలో మరో గుడి కొత్తగా నిర్మించబడింది. అది పెద్ద ప్రాంగణంతో చుట్టూ చిన్న మందిరాలతో ఎందరో దేవతలకు కొలువై ఉన్నది.

ప్రత్యేక భవనాలు...

అప్పటి గవర్నర్ నివసించిన బంగళా ఆ రీవిని కోల్పోయి జీర్ణావస్థలో ఉంది. చిన్న చిన్న మార్పులతో, మరమ్మతులతో దానికి పూర్వవైభవం తెప్పించే ప్రయత్నం జరుగుతోంది. డెన్మార్క్ తరువాత వచ్చిన ఆంగ్లేయ అధికారులు కొన్ని బంగళాల్లో నివసించడంతో అవి వారి పేరున పిలువబడుతున్నాయి. అప్పటి బ్రిటీష్ కలెక్టర్ నివసించిన బంగళాను కలెక్టర్ బంగళాగా పిలుస్తున్నారు. అది స్వల్పమైన మార్పులతో నిమ్రానా హోటల్‌గా రూపుదిద్దుకొని 'బంగళా ఆని ది బీచ్' గా పిలువబడుతూ పర్యాటకులకు నివాస స్థానమైంది. పెద్ద ప్రాంగణంతో, విశాలమైన గదులతో ఆనాటి డానిష్ శైలిలో నిర్మించబడి బీచ్ ఒడ్డున ఉన్న ఈ బంగళా అద్భుత నిర్మాణం. పక్కనే మరో బంగళా కూడా హోటల్‌గా మార్పు చేయబడింది. పరేడ్ గ్రౌండ్, ప్రవేశ ద్వారం మధ్య ఎన్నో చర్చిలు, పాఠశాలలు నిర్మించబడి ఆనాటి డెన్మార్క్ వారి పాలనకు చిహ్నాలుగా నిలిచి ఉన్నాయి. సముద్రతీరంలో ఎందరో మత్స్యకారులు గృహాలు నిర్మించుకొని జీవించేవారు. సునామీ ఆ తీరప్రాంతాన్ని అతలాకుతలం చేసింది. అప్పటి నుండి వారు తీరానికి దూరంగా నివసిస్తున్నారు.

మైలాడుదురై సమీపంలో...

తరంగంబాడిలో నివసించే ప్రజలకు, పర్యాటకులకు బీచ్ ఒక ఆకర్షణ. ఇక్కడ సముద్రం ఒడ్డు స్వచ్ఛంగా ఉండడంతో ఉదయం, సాయంత్ర వేళల్లో కుటుంబ సమేతంగా జనాలు బీచ్‌కి వచ్చి సందడి చేస్తుంటారు. తరంగంబాడి తమిళనాడులోని మైలాడుదురై జిల్లాలో ఉంది. ఎంతోమంది పర్యాటకులు తరంగంబాడి కేంద్రంగా చేసుకొని చుట్టుపక్కల ఉన్న దర్శనీయ స్థలాలకు కూడా వెళ్లి వస్తుంటారు. 60 కి.మీ దూరంలో ఉన్న కుంభకోణం, 54 కి.మీ దూరంలోని వేలాంకన్ని, నాగూర్ దర్గా, నాగపట్టినం, ఇంకా సమీపంలోని తిరునల్లార్, వైదీశ్వరన్, తిరుకడలూర్, శీర్గాళి, మైలాడుత్తురై మొదలైన దర్శనీయ స్థలాలు ట్రాంకోబార్ నుంచి వెళ్లి వచ్చేందుకు అనుకూలం.

మన దేశం విదేశీ వ్యాపారులను ఎంతగా ఆకర్షించిందో తెలియజెప్పే నిలువెత్తు సాక్ష్యం తరంగంబాడి. వ్యాపారం కోసం వచ్చి ఆయా ప్రాంతాలను ఆక్రమించుకొని సొంతం చేసుకొని పాలించడం అనుచిత చర్యే అయినా పరిస్థితుల ప్రభావంతో ఆనాటి రాజరికాలు తలపిస్తాయి. మన దేశ సంస్కృతిని చాటే గొప్ప గొప్ప దేవాలయాలు, శిల్ప సంపదలకు ఆలవాలమైన అనేక కట్టడాలు ఒక ప్రక్క, విభిన్న దేశాల సంస్కృతిని, విదేశీ శిల్ప నిర్మాణశైలిని ప్రతిబింబించే స్మారకాలు, కోటలు మరో పక్క నిలిచి మన దేశం భిన్నత్వానికి ప్రతీక అనే నిజానికి నిరూపణగా నిలిచాయి. అందుకు ప్రత్యక్ష సాక్ష్యం 'తరంగంబాడి'.

కోలీవుడ్ దర్శకుల సంఘానికి రజనీ కుమార్తె విరాళం

యేటా రూ.10 లక్షలు


ఉదయకుమార్‌కు చెక్కు అందజేస్తున్న ఐశ్వర్య. చిత్రంలో ఆర్‌కే సెల్వమణి తదితరులు

అడయార్, సెప్టెంబరు 14: తమిళ చిత్ర దర్శకుల సంఘానికి సూపర్‌స్టార్ రజనీకాంత్ పెద్ద కుమార్తె, సినీ దర్శకురాలు ఐశ్వర్య రజనీకాంత్ రూ.10 లక్షల విరాళం అందజేశారు. ఇకపై ఇంతే మొత్తంలో యేటా అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ నిధులను సినీ దర్శకులు, సహాయ దర్శకుల పిల్లల విద్యాభ్యాసం కోసం ఖర్చు చేయాలని ఆమె సూచించారు. దర్శకుల సంఘం సభ్యులు తమ పిల్లల చదువుల కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, వారికి కొంతైనా ఉపశమనం కలిగించాలన్న ఉద్దేశంతో ఈ నిధులను అందిస్తున్నట్టు ఆమె వెల్లడించారు. ఈక్రమంలో శుక్రవారం రూ.10 లక్షల చెక్కును దర్శకుల సంఘ అధ్యక్షుడు ఆర్వీ ఉదయకుమార్, ప్రధాన కార్యదర్శి పేరరసు, కోశాధికారి చరణ్‌కు ఆమె అందజేశారు. ఆ సమయంలో పెప్సీ అధ్యక్షుడు, సినీ దర్శకుడు ఆర్‌కే సెల్వమణి ఉన్నారు. ఈ సందర్భంగా సినీ దర్శకులు ఎళిల్, సి.రంగనాథన్, మిత్రన్ జవహర్, ఎస్ఆర్ ప్రభాకరన్, కార్యవర్గ సభ్యులు ఐశ్వర్యకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, తొలి దశలో 2024లో ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్న అసిస్టెంట్ దర్శకుల పిల్లలకు సహాయం చేయాలని దర్శకులు సంఘం నిర్ణయించింది.

చిత్రజ్యోతి

'కాంచన-4'లో పూజా హెగ్డే?



దర్శక నటుడు, నిర్మాత రాఘవ లారెన్స్ కథానాయకుడిగా వచ్చిన 'కాంచన' సిరీస్‌లో భాగంగా త్వరలో నాలుగో భాగం తెరకెక్కనుంది. ఇందులో హీరోయిన్‌గా బుట్టబొమ్మ పూజా హెగ్డేను తీసుకునేందుకు సంప్రదింపులు జరుపుతున్నారు. ఒకవైపు ఇతర దర్శకులతో కలిసి పనిచేస్తున్న రాఘవ లారెన్స్.. మరోవైపు 'కాంచన-4' స్క్రిప్టును కూడా సిద్ధం చేసుకున్నారు. ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో ఉన్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కించాలని ఆయన నిర్ణయించారు. దీనికి అనుగుణంగానే ఈ స్టోరీ విన్న తర్వాత గోల్డ్‌మైన్స్ నిర్మాణ సంస్థ ముందుకు వచ్చింది. దీంతో ఈ సంస్థతో కలిసి రాఘవ లారెన్స్ కాంచన నాలుగో భాగాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నారు. గత మూడు చిత్రాల తరహాలోనే నాలుగో భాగాన్ని కూడా ప్రేక్షకులను అలరించేలా స్క్రిప్టును సిద్ధం చేశారు. అందుకే హీరోయిన్‌గా పూజా హెగ్డేను తీసుకునేందుకు సంప్రదింపులు జరుపుతున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. కాగా, గోల్డ్‌మైన్స్ నిర్మాణ సంస్థ అనేక తమిళ హిట్ చిత్రాలను హిందీలోకి అనువాదం చేసి విడుదల చేసింది. ఇపుడు భారీ బడ్జెట్‌తో తమిళ చిత్రాన్ని నిర్మించేందుకు ముందుకు రావడం గమనార్హం.

నవంబరులో సూర్య 'కంగువా'!


'కంగువా' చిత్రంలో సూర్య

హీరో సూర్య, దర్శకుడు చిరుత్తై శివ కాంబినేషన్‌లో ప్రముఖ నిర్మాత కేఈ జ్ఞానవేల్ తన సొంత నిర్మాణ సంస్థ స్టూడియో గ్రీన్ బ్యానరుపై నిర్మించిన 'కంగువా' చిత్రాన్ని నవంబరులో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తమిళ, తెలుగు, కన్నడ, మలయాళం సహా హిందీతో పాటు దాదాపు పదికిపైగా భాషల్లో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇప్పటికే అన్ని రకాల నిర్మాణ పనులను పూర్తి చేసుకుంది. దీంతో దీపావళి పండుగను పురస్కరించుకుని అక్టోబరు 10న విడుదల చేయాలని తొలుత నిర్ణయించారు. అయితే, అదేరోజున సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'వేట్టయన్' విడుదలకానుంది. దీంతో 'కంగువా' చిత్రం విడుదలను వాయిదా వేశారు. ఇపుడు సరైన తేదీ కోసం చిత్ర బృందం అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా, నవంబరు 14న సరైన తేదీగా భావిస్తున్నారు. అయితే, ఈ తేదీని అన్ని భాషల పంపిణీదారులతో చర్చించి ఓ నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు. డిస్ట్రిబ్యూటర్లకు ఈ తేదీపై ఎలాంటి అభ్యంతరం లేకుంటే అదే రోజున ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని భావిస్తున్నారు. ఇందుకోసం సెన్సార్ కార్యక్రమాలను కూడా ముందుగానే పూర్తి చేయాలని చిత్ర బృందం భావిస్తోంది.


'చట్టం ఎన్ కైయిల్'లో సతీష్

సతీష్ హీరోగా 'చట్టం ఎన్ కైయిల్'

హాస్య నటుడు సతీష్ హీరోగా నటించిన కొత్త చిత్రం 'చట్టం ఎన్ కైయిల్'. 'సిక్సర్' ఫేం చాచీ దర్శకుడు. ఈ నెల 20న విడుదల కానుంది. ఈ చిత్ర టీజర్‌ను తాజాగా ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి, దర్శకుడు వెంకట్ ప్రభు తమ ట్విట్టర్ హ్యాండిల్స్‌లో విడుదల చేశారు. ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో సంపత్, అజయ్‌రాజ్, పావెల్ నవగీతన్, విద్యాప్రదీప్, మైమ్‌గోపి, రిత్విక, తమిళ్ సెల్వి, గజరాజ్ తదితరులు నటించారు. తాజాగా విడుదలైన టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. 'సినిమా మిస్టరీతో మొదలవుతుంది. హత్యలకు పాల్పడింది ఎవరో పోలీసులే గుర్తించలేకపోతారు. హీరో సతీష్ పోలీస్ జీపులోనే దిగుతాడు. అతని మొహంలో ఒక విధమైన భయం కనిపిస్తుండగా, స్టేషన్‌లో కూర్చోబెడతారు. ఇలా ఆసక్తికర సన్నివేశాలు ఒకదాని తర్వాత ఒకటి వరుసగా జరుగుతాయి. ఈ మిస్టరీ హత్యల వెనుక ఎవరున్నారు. సస్పెన్స్ క్రైం థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కించారు'. షణ్ముగం క్రియేషన్స్ బ్యానరుపై తెరకెక్కిన ఈ చిత్రానికి ఎంఎస్ జోన్స్ రూబెర్ట్ సంగీతం.

కీలంబాక్కం బస్‌స్టేషన్‌కు పోటెత్తిన ప్రయాణికులు

● తెల్లవారుజాము వరకు తరగని రద్దీ

● సొంతూళ్లకు లక్ష మందికి పైగా పయనం



ప్యారీస్, సెప్టెంబరు 14: శని, ఆదివారాలు, మంగళవారం మిలాద్ ఉన్ నబి వరుస సెలవులు ప్రకటించడంతో చెన్నైలో నివసిస్తున్న ప్రజలు తమ సొంతూళ్లకు బయల్దేరుతున్నారు. ఇందువల్ల శుక్రవారం రాత్రి నుంచే నగర శివారులో ఉన్న కీలంబాక్కం బస్‌స్టేషన్‌కు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు తరలివెళ్లడంతో తెల్లవారుజాము వరకు కిటకిటలాడింది. రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థలు నడుపుతున్న ప్రత్యేక బస్సుల్లో సుమారు లక్ష మందికి పైగా సొంతూళ్లకు పయనమయ్యారు. ఇక్కడి నుంచి తిరుచ్చి, విల్లుపురం, కోవై, పొల్లాచ్చి, తంజావూరు, తిరువణ్ణామలై, పెరంబలూరు, కుంభకోణం, జయంకొండాన్, తెన్‌కాశి, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, తూత్తుకుడి తదితర దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సౌకార్యర్థం రవాణా సంస్థలు అదనంగా బస్సులు నడిపాయి. శుక్రవారం రోజూ నడుపుతున్న 1,126 బస్సులతో పాటు అదనంగా 730 బస్సులు నడిపారు. ఇవే కాకుండా, ప్రైవేటు రవాణా సంస్థలు 600 ఆమ్నీ బస్సులు నడిపాయి. శుక్రవారం రాత్రి 7.30 గంటల నుంచి శనివారం ఉదయం 5 గంటల వరకు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపారు. నగరం, శివారు ప్రాంతాల నుంచి బయల్దేరిన బస్సులన్నీ ఆయా మార్గాల్లో ఉన్న టోల్‌గేట్ల వద్ద ఆగిపోవడంతో ట్రాఫిక్ రద్దీ నెలకొంది. దూరప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సులు చెంగల్పట్టు సమీపంలోని బరనూరు టోల్‌గేట్ నుంచి పొత్తేరి వరకు, అలాగే గుడువాంజేరి నుంచి ఊరపాక్కం వరకు పెద్దసంఖ్యలో బారులుతీరాయి. దీంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడ్డారు. వరుస సెలవులు దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం నడుపుతున్న అదనపు బస్సుల సంఖ్యను పెంచేలా అధికారులు పరిశీలించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


చెన్నై అన్నానగర్‌లో 'ఇండియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్' (ఐసీడబ్ల్యూఓ), 'అభయ్‌ధన్ ట్రస్టు' సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ప్రారంభిస్తున్న కౌన్సిలర్ సెమ్మొళి, సంస్థ కార్యదర్శి హరిహరన్ తదితరులు



కిలో మల్లెలు రూ.2,000

ఐసిఎఫ్, సెప్టెంబరు 14: ఓనం పండుగ సందర్భంగా పూల ధరలు పెరిగాయి. కిలో మల్లెపూలు రూ.2,000కు విక్రయమవుతున్నాయి. పండుగ సందర్భంగా మలయాళీయులు పువ్వులతో వివిధ రకాల ముగ్గులు వేస్తుంటారు. దీంతో, తిరువనంతపురం చుట్టుపక్కల ప్రాంతాలకు కన్నియాకుమారి జిల్లా దోవాళై నుంచి పూలు ఎగుమతి చేస్తుంటారు. అలాగే, కేరళ వ్యాపారులు ఇక్కడికి నేరుగా వచ్చి కొనుగోలు చేస్తుంటారు. దోవాళై పూల మార్కెట్‌కు ఇతర ప్రాంతాల నుంచి కూడా 150 నుంచి 200 టన్నుల పూలు దిగుమతి అవుతుంటాయి. వినియోగం పెరగడంతో శుక్రవారం 150 టన్నులు పూలు విక్రయమయ్యాయి. గరిష్ఠంగా కిలో మల్లెపూలు రూ.2,000, పిచ్చి పువ్వులు రూ.1,600కు విక్రయమయ్యాయి.

పోటీ యుగంలో సవాళ్లను అధిగమించండి

● పట్టభద్రులకు ఆండ్రీ కాన్‌స్టాన్‌టిన్ గే పిలుపు

● ఘనంగా హిందూస్థాన్ వర్శిటీ స్నాతకోత్సవం

చెన్నై, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ యుగంలో విశ్వవ్యాప్తంగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకోవడంతో ఎదురయ్యే సవాళ్లను అధిగమించాలని బ్రిటన్‌కు చెందిన నోబుల్ అవార్డు గ్రహీత ఆండ్రీ కాన్‌స్టాన్‌టిన్ గే పట్టభద్రులకు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం పదూరు వద్దనున్న హిందూస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (హెచ్‌ఐటీఎస్) డీమ్డ్ విశ్వవిద్యాలయం 15వ స్నాతకోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ స్నాతకోత్సవాలనికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి స్నాతకోత్సవ సందేశమిచ్చారు. వివిధ పాఠ్యాంశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు, పీహెచ్‌డీ విద్యార్థులకు పతకాలు నగదు పురస్కారాలను ఆయన అందజేశారు. ఈ స్నాతకోత్సవంలో 1600 మంది విద్యార్థులు పట్టాలను స్వీకరించారు.

నంబి నారాయణన్, వీరముత్తువేల్‌కు డాక్టరేట్లు

ఈ స్నాతకోత్సవంలో భారత అంతరిక్ష శాస్త్రవేత్త నంబి నారాయణన్‌కు, ఇస్రో చంద్రాయాన్ -3 ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ పి. వీరముత్తువేల్‌కు ఆ విశ్వవిద్యాలయం చాన్సలర్ ఆనంద్ జేకబ్ వర్గీస్ గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేశారు. ఆ సందర్భంగా నంబినారాయణన్ మాట్లాడుతూ ఓటమి నుంచే పాఠాలు నేర్చుకుని విజయాన్ని సాధించాలని విద్యార్థులకు హితవు పలికారు.



హిందూస్థాన్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో విద్యార్థినికి పట్టాను ప్రదానం చేస్తున్న చంద్రయాన్-3 ప్రాజెక్ట్ డైరెక్టర్ వీరముత్తువేల్